

కోడుమూరులో మాట్లాడుతున్న కెవి.నారాయణ

యువగళం @1000

- లోకేష్ పాదయాత్రలో మైలురాయి - నేడు ఆదోనిలో శిలాఫలాకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వెయ్యి కిలోమీటర్ల మైలురాయికి శుక్రవారం చేరుకోనుంది. జనవరి 27న చిత్తూరు జిల్లా కుప్పం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. 77 రోజుల పాటు 27 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పాదయాత్ర సాగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఉమ్మడి అనంతపురంలో 9 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగిన యువగళం పాదయాత్ర 77వ రోజు ఆదోనిలో వెయ్యి కిలోమీటర్ల మైలురాయిని చేరుకోనుంది. 400 రోజుల్లో 4వేల కిలోమీటర్లు చేరుకోవాలని పాదయాత్ర ప్రారంభించిన లోకేష్ రోజుకు సగటున 10కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించాలని తొలుత నిర్ణయించగా, లక్ష్యానికి మించి ఇప్పటి వరకు సగటున రోజుకు 13 కిలోమీటర్లు నడక సాగించారు. పలువురు లోకేష్‌ను కలిసి సమస్యలు చెబుతుండగా, మరికొందరు వినతిపత్రాల రూపంలో సమస్యలు తెలియజేస్తున్నారు. వివిధ వర్గాల ప్రజల నుంచి ఇప్పటివరకు 1,300 వినతిపత్రాలు యువనేతకు అందాయి. యువత, మహిళలు, రైతులు, వ్యాపారులు, ఐటి ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, వివిధ సామాజికవర్గాల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశాలు ఏర్పాటు చేస్తూ అధికారంలోకి వస్తే ఆయా వర్గాలకు తాము ఏం చేస్తామన్నది లోకేష్ హామీ ఇస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో నిర్వహించే బహిరంగ సభలో ఆయా ఎమ్మెల్యేల అవినీతి గురించి ప్రశ్నిస్తున్నారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. మంత్రి గుమ్మనూరు జయరాం భూ కబ్జా బాగోతాలు, కర్ణాటక మద్యం అక్రమ వ్యాపారాన్ని బయటపెట్టారు. ప్రభుత్వ ధర ప్రకారం 180 ఎకరాల ఇట్టినా భూములను కొనుగోలు చేసి రైతులకు అందిస్తామని బెంజి మంత్రిని ఇరకాటంలో పెట్టారు.

13 కమిటీలతో ముందుకు..

యువగళంలో మొత్తం 13 కమిటీలు పనిచేస్తున్నాయి. పాదయాత్ర మెయిన్ కోఆర్డినేటర్‌గా కిలారు రాజేష్, అధికార ప్రతినిధులుగా ఎంఎస్ రాజు, దీపక్ రెడ్డి, భోజన వసతుల కమిటీగా మద్దిపట్ల సూర్యప్రకాష్, లక్ష్మీపతి, వాలంటీర్ కోఆర్డినేషన్ కమిటీగా రవి నాయుడు, ప్రణవ్ గోపాల్, రూట్ కోఆర్డినేషన్ కమిటీగా రవి యాదవ్, అడ్వాన్స్ టీమ్ కమిటీగా డూండీ రాకేష్, నిమ్మగడ్డ చైతన్య, శ్రీరంగం నవీన్ కుమార్, ప్రత్తిపాటి శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. వసతి ఏర్పాట్ల కమిటీగా జంగాల వెంకటేష్, నారా ప్రశాంత్, లీలా, శ్రీధర్, ఐనంపూడి.రమేష్, యువగళం పిఆర్ టీమ్‌గా మునీంద్ర, కిషోర్, కృష్ణారావు, సోషల్ మీడియా కోఆర్డినేషన్‌గా కౌశిక్, అర్జున్, అలంకరణ కమిటీగా మలిశెట్టి వెంకటేశ్వర్లు, బ్రహ్మం, రూట్ వెరిఫికేషన్ కమిటీగా అమర్నాథ్ రెడ్డి, కస్తూరి కోటేశ్వరరావు, తాగునీటి సదుపాయం కోసం భాస్కర్, వెంకట్ పనిచేస్తున్నారు.

ఆదోని 21 వార్డు దత్తత కోసం హామీ

పాదయాత్రలో ప్రతి వంద కిలోమీటర్ల మైలు రాయికీ ఒక హామీతో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న లోకేష్ శుక్రవారం వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని ఆదోనిలో ఆవిష్కరించనున్నారు. అధికారంలోకి రాగానే ఆదోని 21వ వార్డును దత్తత తీసుకోనున్నట్లు హామీ ఇవ్వనున్నారు. తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇవ్వనున్నారు.

మతోన్మాద బిజెపిని తరిమికొట్టండి

- సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-కోడుమూరు

మతోన్మాద బిజెపిని దేశం నుండి తరిమికొట్టండని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ కోరారు. ప్రచారభేరిలో భాగంగా ఏడవ రోజు వెల్దుర్తి మండలం పాలకుర్తి గ్రామంలో జరిగిన ప్రచార భేరిలో కెవి. నారాయణ మాట్లాడారు. ఈ దేశంలో కేంద్రంలో పరిపాలన చేస్తున్న బిజెపి ప్రభుత్వం పేదలపై భారాల మోపుతూ అనేక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. 2019 లో వీర జవాన్ల శవాలపై రాజకీయం చేసి లబ్ధి పొందిన బిజెపిని దేశం నుండి తరిమికొట్టాలని దేశ భవిష్యత్తును కాపాడుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్,ధరలు పెంచి ప్రజలపై ఎనలేని భారం మోపుతోందన్నారు. గ్యాస్ ధర రూ.1200 చేసిందని, ప్రజావ్యతిరేక విధానాలపై విసిగి వేసారిన ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపే సమయం ఆసన్నమైందన్నారు. ఎందుకంటే ఆంధ్ర రాష్ట్రానికి తీరని అన్యాయం చేసి ప్రజలు కోలుకోలేనంత దెబ్బతీసిందన్నారు. ప్రత్యేక హోదా 5 సంవత్సరాల చాలదు పది సంవత్సరాలు ఇస్తామని తిరుపతి వెంకన్న సాక్షిగా తిరుపతి బహిరంగ సభలో చెప్పిన నరేంద్ర మోడీ మాటతప్పారన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తామని 2004లో అప్పటి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారన్నారు. ఆలూరు పై ప్రాంతంలో వేదవతిపై రిజర్వాయర్ నిర్మిస్తే కర్నూలు పార్లమెంటు కొంత అభివద్ధి చెందుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ దేశానికి పట్టిన నరేంద్ర మోడీ పీడను వదిలించుకోవడానికి ప్రజలందరూ సిద్ధం కావాలని కోరారు. సిపిఐ. సిపిఎం మండల కార్యదర్శులు బి.రాజు, గఫూర్‌మియా సిఐటియు మండల కార్యదర్శి జి పి.వీరన్న, సిపిఎం సీనియర్ నాయకులు వీరన్న, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మన్న, జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జి.మద్దిలేటి ఆటో వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి మధు, జీపు డ్రైవర్ అసోసియేషన్ నాయకులు రాముడు, సిపిఐ నాయకులు నారాయణ, సిపిఎం నాయకులు గిడ్డయ్య మునుస్వామి పాల్గొన్నారు.

వెల్దుర్తి : డిజిటల్ ఇండియా,మేకిన్‌లి ఇండియా నినాదాలతో ప్రజలను నిలువున మోసం చేసిన బిజెపిని గద్దె దింపాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార బేరి పాదయాత్ర వెల్దుర్తి మండలం సూదేపల్లి గ్రామంలో గురువారం నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు నగేష్, సిపిఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, సిఐటియు నాయకులు రాజు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, ఎల్లప్ప, చిలిపి కృష్ణ పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కూలీలకు ఉపాధి పనులను కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి కూలీలు చేసిన పనులకు చెల్లింపులు కూడా త్వరగా అయ్యేలా చూడాలని ఆదేశించారు. గురువారం కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్ పంచాయతీ రాజ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలపై సమీక్షించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇకనుంచి క్షేత్రస్థాయిలోకి వెళ్లి గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తాను అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మండల స్థాయిలో వ్యవస్థలు పనిచేయడం లేదు

- స్పందన అర్జీలు త్వరగా పరిష్కరించాలి - కలెక్టర్ సృజన

మండల స్పెషల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. మండల స్థాయిలో ఉన్న ప్రభుత్వ వ్యవస్థలు సరిగ్గా పనిచేయడం లేదని జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ ప్రభుత్వ పథకాల అమలు పై మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ జిల్లా అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్స్‌గా నియమించామన్నారు. వారికి కేటాయించిన మండలాల్లో జిల్లా కలెక్టర్ తరపున మండల స్పెషల్ ఆఫీసర్లు అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణలో మండల స్పెషల్ ఆఫీసర్లకు పూర్తిగా సహకరించాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్లు ప్రతి బుధవారం వారికి కేటాయించిన మండలాలకు సంబంధించిన ఒకటి లేదా రెండు గ్రామాల్లో పర్యటించాలన్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భవతులకు పోషకాహారం పంపిణీ, రిజిస్టర్ల నిర్వహణ, బాల్య వివాహాల పరిస్థితి, హౌసింగ్, గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, గడప గడపకు మన ప్రభుత్వం పనులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఫంక్షనల్ టాయిలెట్స్, తాగునీరు,ఎలక్ట్రిసిటీ, సంక్షేమ వసతి గృహాల నిర్వహణను పరిశీలించాలన్నారు. సచివాలయం, మండల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు కూడా ఇక్కడికి వస్తున్నాయంటే మండలాల్లో వ్యవస్థ పనితీరు ఎలా ఉందో అర్థం అవుతోందన్నారు. వచ్చిన సమస్యలకు సరైన సమాధానం ఇవ్వకపోవడం వల్ల ఎక్కువ ఫిర్యాదులు రీ ఓపెన్ అవుతున్నాయన్నారు. రెవెన్యూకు సంబంధించి 88 శాతం, పంచాయతీ రాజ్‌కు సంబంధించి 70 శాతం, మునిసిపల్ పరిపాలన, హోమ్ శాఖల నుంచి వంద శాతం ,ఆరోగ్య శాఖకు 81 శాతం ఆర్థికేతర సమస్యలు వస్తున్నట్లు రాష్ట్ర స్థాయిలో విశ్లేషణ జరిగిందన్నారు. స్పందన అమలుపై పూర్తి స్థాయిలో ఆడిట్ నిర్వహిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీదారులకు ర్యాండంగా ఫోన్ కాల్స్ చేస్తామని తెలిపారు. పాఠశాలలు తెరచిన తర్వాత బడి బయట పిల్లల పై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిఆర్‌పి లు, వైద్య శాఖ సిబ్బంది జాయింట్ సర్వే నిర్వహించి రిపోర్ట్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలకు ఎండార్స్ మెంట్ ఇచ్చిన విషయం అర్జీదారులకు తెలియడం లేదని, ఎండార్స్‌మెంట్ గురించి తెలియచేయాలని జాయింట్ కలెక్టర్ మండల అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుకు సంబంధిత అధికారికి మాత్రమే పంపేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ సృజన

ఆదోనిలో డిగ్రీ కళాశాల

- కర్నూలుకు పరిశ్రమలు తీసుకొస్తాం - యువగళంలో నారా లోకేష్

ప్రజాశక్తి-ఆదోని/ఆదోని రూరల్

టిడిపి అధికారంలోకి రాగానే ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర శుక్రవారం ఆదోని మండలంలో సాగింది. ఆలూరు నియోజకవర్గం ములుగుందం క్యాంప్ సైట్‌లో ప్రారంభమైన యాత్ర ఆదోని నియోజకవర్గంలోకి ప్రవేశించి పెద్దపెండేకల్లు, ఆరేకల్, నాగలాపురం, కపటి క్రాస్ మీదుగా ఆదోని వరకూ సాగింది. పెద్ద పెండేకల్లు వద్ద టిడిపి ఆదోని నియోజకవర్గం ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, రాష్ట్ర నాయకులు ఉమాపతి నాయుడు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, ఇతర శ్రేణులు లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. చిన్నారులు కలశాలతో హారతిస్తూ ఆహ్వానించారు. పెద పెండేకల్లు శివారు ఎర్రచెరువు వంకలో ఉపాధి హామీ కూలీలను లోకేష్ కలిశారు. గడ్డపారతో మట్టిని తవ్వుతూ వారి కష్టాలు తెలుసుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పని చేస్తే రూ.150 కూలి ఇస్తున్నారని, నీడ కోసం పరదాలు, తాగేందుకు నీరు కూడా లేవని కూలీలు లోకేష్‌కు తెలిపారు. అధికారంలోకి రాగానే పనిదినాలు, కూలి పెంచేందుకు చర్యలు తీసుకుంటామని లోకేష్ హామీ ఇచ్చారు. ఆరేకల్‌లో వాల్మీకులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వాల్మీకుల మధ్య ప్రాంతీయ విభేదాన్ని తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. నాగలాపురంలో విద్యార్థులు, యువతతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పడడం లేదని, గ్రూపు-2 ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, మహిళలకు భద్రత లేదని పలువురు లోకేష్‌కు తెలిపారు. లోకేష్ మాట్లాడుతూ... ప్రతి నియోజకవర్గంలో ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఐటి కంపెనీలు ఏర్పాటు చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని, బకాయిలన్నీ చెల్లించి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతేడాది నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ప్రత్యేక పాఠ్యాంశాలు పెట్టి మహిళల గొప్పతనం తెలిసేలా చేస్తామన్నారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, భూమా విఖ్యాత్ రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు. ఆదోని విడిది కేంద్రంలో బస చేశారు. గురువారం మొత్తంగా 13.9 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. శుక్రవారం ఆదోని పట్టణంలో యువగళం యాత్ర వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని చేరుకోనుంది.

ఆదోని నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నారా లోకేష్

మైనార్టీలపై ఎందుకంత కక్ష జగన్..?

పాదయాత్రలో వెళ్తూ ఆదోని మైనార్టీ ఐటిఐ వద్ద లోకేష్ సెల్ఫీ తీసుకున్నారు. రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలపై జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు అర్ధాంతరంగా ఆగిపోయిన ఈ కళాశాల నిర్మాణమే సాక్ష్యమని లోకేష్ పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వంలో రూ.7 కోట్లు కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించామని, వైసిపి వచ్చాక నాలుగేళ్లలో ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేదని తెలిపారు. కొత్తగా పనులు చేయడం ఎలాగూ చేతకాదు.. గతంలో ప్రారంభించిన పనులైనా చేయలేని దద్దమ్మ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. మైనార్టీలపై ఎందుకంత కక్ష జగన్ రెడ్డీ..? అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు.

మీనాక్షి నాయుడి చమటను తుడుస్తున్న లోకేష్

రాజవర్ధన్ వర్ధంతి సందర్భంగా పేదలకు తోపుడు బండ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

చిరు వ్యాపారులకు తోపుడుబండ్లు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

గార్గేయపురం గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు తోపుడుబండ్లను పంపిణీ చేశారు. ఈ మేరకు గురువారం మాజీ ఎంపిపి రాజా వర్ధన్ రెడ్డి ప్రథమ వర్ధంతి పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద దాదాపుగా పది తోపుడు బండ్లను చిరు వ్యాపారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మండల టిడిపి మాజీ అధ్యక్షుడు వెంకటేష్ నాయుడు, నాయకులు చందు, రామాంజనేయులు, సూర్య ప్రకాష్ నాయుడు, రహిమాన్ ఎదురూరు రాముడు, శివ పాల్గొన్నారు.

నిత్య కృషీవలుడు రాజవర్ధన్ రెడ్డి

రాజవర్ధన్ వర్దన్‌రెడ్డి వర్ధంతి సభలో దస్తగిరి తదితరులు

పార్టీ అభివృద్ధిలో, ప్రజా సంక్షేమంలో నిత్య కృషీవలుడుగా వెలుగొందిన వ్యక్తి తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి, మాజీ ఎంపిపి డి.రాజ వర్ధన్‌రెడ్డి అని కర్నూలు టిడిపి యువ నాయకులు బొగ్గుల దస్తగిరి అన్నారు. రాజవర్ధన్ రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఉన్న జ్ఞానపీఠం పాఠశాలలో దస్తగిరి ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. దిన్నదేవరపాడు సర్పంచి మాధవస్వామి, నియోజవర్గ టిఎన్ఎస్ఎఫ్ భాస్కర్, మాబాష, నవీన్, గోకారి, రాఘవేంద్ర, గణేష్, పాల్గొన్నారు.

29న మహాకవి శ్రీ శ్రీ 113వ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ఈనెల 29న ఉదయం 10.00 గంటలకు కర్నూలు లలిత కళా సమితి ఆడిటోరియంలో మహాకవి శ్రీశ్రీ 113వ జయంతి ఉంటుందని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, కర్నూలు సాహితీ స్రవంతి నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 28న ఉదయం 10గంటలకు లలిత కళా సమితి మిని హాల్‌లో శ్రీ శ్రీ రాసిన పాటల పోటీల కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు స్పెషల్ డిప్యూటి కలెక్టర్ కె. మల్లికార్జునుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ మాణిక్య రావు హాజరవుతారన్నారు. ఈ పాటల పోటీలో మంచి ప్రతిభ కనబరిచిన వారికి 29న జయంతి సభలో జయంతి సభలో బహుమతి ప్రదానం చేస్తామన్నారు. గాయనీ, గాయకులకు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వహకులు కోరారు. మరిన్ని వివరాలకు ఈకింది ఫోన్లకు సంప్రదించాలన్నారు. 94900 98748, 98497 53298, 90003 89826, 97039 23473. జయంతి కార్యక్రమానికి ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ జి. సుధాకర్, ప్రముఖ సివిల్ ఇంజనీర్ శివ గోపాల్ గౌడు, ఎస్‌కె.యూనివర్సిటీ మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు జి. రామ సుబ్బారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

గౌరు దంపతుల అన్నదానం

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గౌరు దంపతుల స్వగృహం మాధవి నగర్ లో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు టిడిపి నాయకులు కార్యకర్తలతో టిడిపి నంద్యాల అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి కలసి కేక్ కట్ చేశారు. అనంతరం నందికొట్కూరు రోడ్డు లోనీ షిర్డీ సాయి వృద్ధాశ్రమం లో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా కార్యాలయంలో : నారా చంద్రబాబు జన్మదిన వేడుకలను జిల్లా టిడిపి అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అధ్వర్యంలో కర్నూలు, కోడుమూరు ఇన్చార్జీలు టిజి. భరత్, ఆకెపోగు ప్రభాకర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలసి ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో భారీ కేక్‌ను కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.

తుగ్గలి : మండలం పరిధిలోని జొన్నగిరి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి టిడిపి నేత చంద్రబాబు నాయుడు 73వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. టిడిపి మండల కమిటీ అధ్యక్షులు తిరుపాలనాయుడు, టిడిపి నాయకులు బాలన్న, జొన్నగిరి సర్పంచ్ ఓబులేసు, త్రిమూర్తులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దికేరలో

భరత్‌కు కేక్ తినిపిస్తున్న సోమిశెట్టి

క్రిష్ణగిరి : క్రిష్ణగిరి మండల కేంద్రంలో ఘనంగా టిడిపి అధినేత చంద్రబాబు 74వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా టిడిపి మండల అధ్యక్షులు కటారి కొండ మర్రి శ్రీరాములు, టిడిపి ప్రధాన కార్యదర్శి యు. గురుస్వామి, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్వి ప్రసాద్ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు.

మద్దికేర : మద్దికేర గ్రామపంచాయతీలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ శివప్రసాద్, టౌన్ అధ్యక్షులు గడ్డం రామాంజనేయులు, మాజీ జడ్‌పిటిసి రాజన్న యాదవ్, ఐటిడిపి కన్వీనర్ హుస్సేన్‌పీరా, పారా విఠోబా, మహిళా నాయకురాలు జానకి, రామలక్ష్మి, కవిత, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టీచర్స్ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్ ఖాన్ ను గురువారం ఆయన కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన ఆఫీసులో పూలమాలతో సత్కరించారు. తన గెలుపునకు సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం హఫీజ్ ఖాన్ రామచంద్రారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు స్కూల్స్ మేనేట్‌మెంట్ అసోసియేషన్ నాయకులు పుల్లయ్య, సుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి, వాసుదేవయ్య, వైసిపి నాయకులు హకీమ్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

ఉద్యోగులపై ఒత్తిడి తేవొద్దు

ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నెలలో జీతాలు ఎప్పుడు వస్తాయో అర్థం కానటువంటి పరిస్థితి ఉందని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ గిరికుమార్‌రెడ్డి అన్నారు. ఉద్యోగుల బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు ఇఎంఐలు చెల్లింపులో ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావద్దని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్‌బిఐ ట్రెజరీ శాఖ బ్యాంకు మేనేజర్‌ను ఎపిజెఎసి అమరావతి నేతలు కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లా చైర్మన్ గిరి కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ప్రతినెల ఒకటో తేదీ జీతం రాకపోవడంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న ఉద్యోగులను డిఫాల్ట్ లిస్టులో పెట్టడంతో వారికి భవిష్యత్తులో తిరిగి రుణాలు తీసుకునే అవకాశం కోల్పోతున్నారన్నారు. బ్యాంకు మేనేజర్లు ప్రభుత్వ ఉద్యోగులపై దయవుంచి వారు తీసుకున్న రుణాలకు ఇఎంఐ లు కట్ చేయకూడదన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జయరాం

లోకేష్ సవాల్‌కు కట్టుబడి ఉన్నాం

- మార్కెట్ ధరలకే రైతులకు భూములు రిజిస్ట్రేషన్ చేయిస్తాం

- రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి-ఆలూరు

నారా లోకేష్ సవాల్‌కు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. గురువారం ఆలూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు చేసిన ఇట్టినా కంపెనీ భూములను హామీ ఇచ్చిన విధంగా 100 ఎకరాలను మార్కెట్ ధరకే తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేయిస్తామని తెలిపారు. రైతులపై ప్రేమ ఉన్న నారా లోకేష్ మిగిలిన భూములను కొనుగోలు చేసి రైతులకు ఇస్తే బీసీ రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఎన్నో ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలు ఆలూరును ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. ఫ్యాక్షన్‌ను రూపుమాపామని తెలిపారు. ఆలూరు నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని ఆరోపిస్తున్న టిడిపి నేతలు అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రంథాలయాల అభివృద్ధి

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి - ఆస్పరి

మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రంథాలయాలు అభివృద్ధి చెందుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. గురువారం ఆస్పరి గ్రంథాలయంలో 'గ్రంథాలయ అభివృద్ధి – ప్రజల భాగస్వామ్యం' అనే అంశంపై గ్రంథాలయ అధికారి విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలకు అందాల్సిన సెస్సును పంచాయతీ పాలకవర్గాలు సక్రమంగా అందించాలని కోరారు. గ్రంథాలయాల్లో నిరుద్యోగులకు ఉపయోగ పడే స్టడీ మెటీరియల్, పెద్దలకు, చిన్నారులకు ఉపయోగపడే పుస్తకాలు కూడా అందుబాటులో ఉంచామన్నారు. గ్రామంలోని పెద్దలు, యువకులు గ్రంథాలయ సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు. విఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, ఆలూరు మాజీ జడ్‌పిటిసి రాంభీంనాయుడు, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, సిఐఒ అశోక్ పాల్గొన్నారు.

కొండను తొలగించాలి

- కెవిపిఎస్, జనసేన, ప్రజాసంఘాల నాయకులు - ఎస్సీ కాలనీవాసుల రాస్తారోకో

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారిన నర్సప్ప కొండను వెంటనే తొలగించాలంటూ కెవిపిఎస్, జనసేన, ప్రజా సంఘాల నాయకులు కోరారు. గురువారం ఎస్సీ కాలనీవాసులు స్థానిక హరిజనవాడ పాఠశాల వద్ద ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. కొండ చీలికలు ఏర్పడి 13 రోజులైనా పట్టించుకోలేదని, వెంటనే చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. ప్రధాన రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ఎస్ఐ తిమ్మారెడ్డి సిబ్బంది వారికి సర్ది చెప్పి విరమింపజేశారు. అనంతరం వారు ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకొని కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. తహశీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ... వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, జనసేన నాయకులు గానిగ బాష, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, జుట్ల మునెప్ప పాల్గొన్నారు.

రాస్తారోకో నిర్వహిస్తున్న కాలనీవాసులు

వసతులు కరువు...

- మండుటెండల్లో ఉపాధి పనులు

- తాగునీటికీ నోచని కూలీలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వేసవిలో రోజూ 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు భగభగమంటున్నాడు. భగ్గుమనే ఎండల్లోనే ఉపాధి హామీ కూలీలు పనులు చేస్తున్నారు. వారు వడదెబ్బతో విలవిల్లాడుతున్నారు. ఉపాధి పనులు చేసే ప్రాంతంలో కనీసం టెంట్లు, తాగడానికి నీటి వసతిని కూడా కల్పించడం లేదని కూలీలు మండిపడుతున్నారు. ఎండలోనూ కష్టపడి పని చేస్తున్నా కూలి డబ్బులు అందక కొన్ని చోట్ల ఆందోళనకు దిగుతున్నారు.

ప్రభుత్వం ప్రతేడాది ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పడమే తప్ప ఆచరణలో మాత్రం నెరవేర్చడం లేదు. ప్రతేడాది కూలీలకు వేసవిలో అందించే భత్యానికి ఈసారి మంగళం పాడారు. ఎర్రటి ఎండలో పని చేస్తున్న కూలీలు కొద్ది సేపైనా సేద తీరడానికి టెంట్లు వేయాల్సి ఉంది. కానీ ఎక్కడా వాటిని ఏర్పాటు చేయలేదు. ఎండలో మాడిపోతున్నారు. దీనికి తోడు కనీసం తాగునీటి వసతిని కూడా కల్పించడం లేదు. తాగడానికి కనీసం నీరు లేకుండా ఎండల్లో పని చేయడం వల్ల ఎండదెబ్బకు గురై అనేకమంది అనారోగ్యం బారిన పడుతున్నారు. పని చేసే ప్రాంతంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారికి చికిత్స చేసేందుకు ప్రథమ చికిత్స కిట్లను ఈ మధ్యనే ప్రభుత్వం అందించింది. ఉపాధి కూలీలకు తాగునీటితో పాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందించాల్సి ఉన్నా అధికారులు ఇంతవరకు ఎక్కడా వీటిని అందించిన దాఖలాలు లేవు.

ఉపాధి వైపే మొగ్గు...

వేసవిలో చేసేందుకు పనులు లేకపోవడంతో రైతులు, ఇతర వర్గాల వారంతా ప్రస్తుతం ఉపాధి హామీ పనులపై మొగ్గు చూపుతున్నారు. మరో పక్క ఉపాధి పని దొరకక, ఎక్కువ డబ్బులు సంపాదించుకోవచ్చనే ఉద్దేశంతో ఉపాధిని కాదని ఆదోని మండలంలో అనేక గ్రామాల నుంచి ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. పని ప్రాంతాల్లో అసౌకర్యాలు రెక్కల కష్టాన్ని నమ్ముకుని పనికొచ్చిన ఆ కూలీల ప్రాణాలను మాత్రం ప్రమాదంలో పడేస్తున్నాయి.

ఉపాధి పని చేస్తున్న కూలీలు

టెంట్లు ఎత్తేశారు : పని చేసే చోట కూలీలకు నీడ కల్పించాలనే ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితం తొమ్మిది వేలకు పైగా టెంట్లు కేంద్రం అందజేసింది. ప్రస్తుతం వాటిలో ఒక్క టెంటు కూడా కనిపించడం లేదు. కూలీలు పని చేసే ప్రాంతాల్లో చెట్ల కింద సేద తీరుతున్నారు. చెట్లు, వేరే ఆసరా లేని చోట కూలీలు ఎండలోనే భోజనం చేస్తున్నారు. టెంట్లు లేకపోవడంతో కూలీలు పని తొందరగా ముగించుకుని ఇంటిబాట పడుతున్నారు.

నీటి తిప్పలు...

ముదురుతున్న ఎండలకు తగట్టు దాహమేస్తోంది. శరీరంలో ఉన్న నీరు నిర్జలీకరణమవుతోంది. దానికి తోడు పని చేసే స్థలాల్లో తాగునీటి వసతి లేకపోవడంతో ఉపాధి కూలీలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఉపాధి కూలీలకు ప్రభుత్వం రోజుకు రూ.5 చొప్పున కూలితోనే కలిపి ఇస్తుంది. కానీ కూలి డబ్బులు సకాలంలో రాకపోవడంతో అధికారులూ చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం కూలీలు ఇళ్ల నుంచే క్యాన్లలో నీళ్లు పట్టుకొచ్చినా వచ్చిన అరగంటలోపే వేడెక్కుతున్నాయి. వేడి నీటినే తాగాల్సి వస్తోంది.

మెడికల్ కిట్లు ఇచ్చారు...పరికరాలు మరిచారు...

పని చేసే చోట కూలీలకు ఎప్పుడైనా.. ఏదైనా ప్రమాదం జరగొచ్చు అనే ఉద్దేశంతో మెడికల్ కిట్లు అందజేశారు. గత ఆరు సంవత్సరాలుగా గడ్డపారాలు, గంపలు తదితరుల పరికరాలను అందించలేదని ఉపాధి కూలీలు తెలిపారు.

టిడ్కో గృహాలను పేదలకు ఎందుకు ఇవ్వలేదు

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడ్కో గృహాలను పేదలకు ఎందుకు ఇవ్వలేదని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని పేదలు, నిరాశ్రయుల సొంతింటి కలను నిజం చేయాలనే ఏకైక సంకల్పంతో టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన 7 వేల టిడ్కో (జిప్లస్3) గృహాలను లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. గురువారం ఆయన వైసిపి ప్రభుత్వానికి సెల్ఫీ ద్వారా సవాలు విసిరారు. అలాగే టిడిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు, చేనేత కళాకారులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బనవాసి సమీపంలో 96 ఎకరాల్లో మంజూరు చేసిన టెక్స్ టైల్స్ పార్కు ఎక్కడా అని ప్రశ్నించారు.

సెల్ఫీ ద్వారా ప్రభుత్వానికి సవాలు విసురుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - ఆదోని

కొత్త పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గురువారం 7వ రోజు ప్రచార భేరి నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ కార్వన్ పేట, తిక్కస్వామి దర్గా ప్రాంతాల్లో ప్రచార భేరి నిర్వహించారు. సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు లక్ష్మన్న, సుదర్శన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. 'వంద రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తాం. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తాం. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాం. విదేశాల్లో ములుగుతున్న నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రజలందరికీ ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తాం' అని ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని మండిపడ్డారు. జిఎస్‌టి పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారని తెలిపారు. వచ్చే 2024 ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. నాయకులు గోపాల్, ఎంకప్ప, తిప్పన్న, ఒబి.నాగరాజు, వీరేష్, ప్రకాష్, నాగరాజు, రాజు, నాగేంద్ర, షేక్షావలీ, షాబీర్ బాష, అంజి పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని ఎరిగేరి, తోవి, బదినేహాల్, కుంటనహాళ్ గ్రామాల్లో ప్రచార భేరి నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ వీరన్న, సిపిఐ మండల కార్యదర్శి ఈరన్న, శంకర్, వలీ, చాంద్ బాష, శంకర, ఈరన్న పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)**లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచార భేరి నిర్వహించారు. ఆర్‌టిసి బస్టాండ్ కూడలిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు మాట్లాడారు. సిపిఎం మండల కన్వీనర్ రాముడు, ప్రజాశక్తి రంగయ్య, మండల నాయకులు వీరేష్, గోపాల్, వెంకటేష్, కర్రెప్ప, నరసింహులు, చిన్నన్న, రాజు, హనుమంతు, రాము పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని విరుపాపురం, కడితోట, జి.హోసళ్లి గ్రామాల్లో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, సిపిఐ మండల కార్యదర్శి బసాపురం గోపాల్ మాట్లాడారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరసప్ప, సిపిఎం మండల కమిటీ సభ్యులు తిక్కప్ప, అంజిత్ కుమార్ గౌడ్, సిపిఎం మండల నాయకులు తిక్కన్న, దావీదు, చిరంజీవి, భీమాంజనేయులు, వీరేష్ పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న గౌస్ దేశాయి

ఆదోనిలో ప్రచార భేరి నిర్వహిస్తున్న నాయకులు

కౌతాళంలో ప్రచార భేరి నిర్వహిస్తున్న నాయకులు

కోసిగిలో ప్రచార భేరి నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

పెట్రోల్ పోసి హత్యాయత్నం చేశారు

- మరణ వాంగ్మూలంలో వెల్లడి

- ఒకరిపై కేసు నమోదు - సిఐ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బోయ కోటేష్ (50) బుధవారం రాత్రి మృతి చెందారు. బాధితుని మరణ వాంగ్మూలంలో కోర్టు జడ్జికి ఇచ్చిన వివరాల మేరకు గురువారం ఇన్వెస్టిగేషన్ అధికారి పత్తికొండ సిఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాలు... మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో గత నాలుగు రోజుల క్రితం మృతుడు బోయ కోటేష్‌పై అదే గ్రామానికి చెందిన వీరేష్ పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరిద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్న నేపథ్యంలో వీరేష్ హత్యాయత్నం చేశాడని వాంగ్మూలంలో తెలిపినట్లు వివరించారు. నిందితునిపై దేవనకొండ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కంటి అద్దాలను సద్వినియోగం చేసుకోండి : వైసిపి

ప్రజాశక్తి - కౌతాళం

కంటి అద్దాలను సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నాయకులు సోమిరెడ్డి, సుధాకర్ రెడ్డి, నర్సారెడ్డి, పాండురంగారెడ్డి కోరారు. గురువారం మండలంలోని రౌడూరు గ్రామంలో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించి, అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో కంటి వైద్య శిబిరంలో హైదరాబాద్ వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి బాధితులను గుర్తించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 30 మందికి కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. బాలనాగిరెడ్డి సహకారంతో మరిన్నీ సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కిష్టప్ప పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్నిబీసీ కాలనీలో నిర్మించాలి

- తహశీల్దార్‌కు మహిళల వినతి

ప్రజాశక్తి - హాలహర్వి

ఎస్సీ కాలనీలో నిర్మించే అంగన్వాడీ కేంద్రాన్ని బీసీ కాలనీలో నిర్మించాలని మహిళలు కోరారు. గురువారం హాలహర్విలో తహశీల్దార్‌కు, సిపిడిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాన్ని ఎస్సీ కాలనీలో నిర్మించాలని అప్పట్లో నిర్ణయించారని తెలిపారు. నిర్ణయించిన ప్రదేశంలో పక్కనే ఊరు బావి చాలా లోతుగా ఉందని, దీనికి ఎలాంటి కంచె కూడా నిర్మించలేదని చెప్పారు. ఎస్సీ కాలనీలో ఎరుకలి వారు పందులను పోషిస్తున్నారని, పిల్లలకు మలేరియా, డెంగీ, విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. మాలలు, వివిధ కులాల వారు అందరూ అక్కడే మలవిసర్జన చేస్తున్నారని చెప్పారు. ఇది కూడా పిల్లలకు చాలా ప్రమాదమని తెలిపారు. ఇన్ని సమస్యలు ఉన్నందున ఈ ప్రాంతంలో అంగన్వాడీ కేంద్రంలో నిర్మించవద్దని కోరారు. పక్కనే ఉన్న బీసీ కాలనీ 3వ వార్డులో ప్రభుత్వ స్థలం ఉందని, ఇంతకుముందే అక్కడ సర్పంచి మల్లికార్జున పునాదులు వేసి సిద్ధంగా ఉంచారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాన్ని అక్కడ నిర్మించాలని కోరారు.

కల్లుకుంట పాఠశాలకు ఇంకా అందని బియ్యం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామంలో పాఠశాలకు ఇంతవరకు బియ్యం అందలేదని, విద్యార్థులకు ఇబ్బందులు కలిగే అవకాశాలు ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వంట నిర్వాహకులే రోజూ రూ.50లకు కిలో బియ్యం తీసుకొచ్చి పిల్లలకు వంట చేసి పెడుతున్నారని తెలిపారు. రోజూ పిల్లలకు 15 కిలోల బియ్యం అవసరమవుతున్నాయని అన్నారు. అలాగే కిరాణషాపుల్లో లేదా ఇతర చోట్ల నుంచి తీసుకొచ్చి పిల్లలకు మధ్యాహ్న భోజనం వండించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. వంట నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు బియ్యం అందేలా చూడాలని కోరారు.

రైతు సమస్యలను పరిష్కరించండి : ఎఐకెఎస్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని రైతు సమస్యలను పరిష్కరించడంలో ఇన్‌ఛార్జీ తహశీల్దార్ పూర్తిగా విఫలమయ్యారని సిపిఐ తాలూకా కార్యదర్శి భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, కమిటీ సభ్యులు రాజు, ఎఐకెఎస్ తాలూకా కార్యదర్శి మబ్బు ఆంజనేయ విమర్శించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎఐకెఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇన్‌ఛార్జీ తహశీల్దార్ విధి నిర్వహణలో రాజకీయ నాయకులకు ఓ రకంగా, సామాన్యులకు మరోరకంగా చేస్తున్నారని విమర్శించారు. రైతు సమస్యలు పరిష్కరించని తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం : అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అగ్ని ప్రమాదాలపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపక అధికారి జి.రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా చివరి రోజు ఫైర్ స్టేషన్‌కు ప్రజలను పిలిపించి అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించి, వాటి పని తీరును వివరించారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అలాగే కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కాముకుడు చంద్రబాబు

- మాజీ ఎమ్మెల్యే బీవీ - ఘనంగా బాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రాభివృద్ధి కాముకుడు టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, వయో భారాన్ని సైతం లెక్క చేయకుండా నవయువకుడిలా కాలంతో పోటీ పడి రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడే నాయకుడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి కొనియాడారు. గురువారం టిడిపి కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భావితరాల భవిష్యత్తును ఆలోచించి వారికి భరోసా కల్పిస్తూ అడుగులు ముందుకు వేసే అపర భగీరథుడని తెలిపారు.

బ్లడ్ క్యాన్సర్ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

నందవరం మండలం నాగలదిన్నె గ్రామానికి చెందిన వేణుగోపాల్ రావు కుమార్తె కీర్తనా బాయి లుకేమియా క్యాన్సర్ (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్నారని కుటుంబ సభ్యుల ద్వారా బీవీ తెలుసుకున్నారు. కీర్తనా బాయిని హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చేర్పించి తన మిత్రుడైన డాక్టర్ శ్రీనివాస్ (అమెరికా)ను ఒప్పించి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా కీర్తనా బాయి చికిత్స కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేయించి చెక్కును టిడిపి నాగలదిన్నె గ్రామ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. టిడిపి నాయకులు మాధవరావు దేశాయి, గడ్డం నారాయణరెడ్డి, ఖాసీం వలీ పాల్గొన్నారు. **మంత్రాలయం** స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధి శూన్యమని, ఆయన వల్ల ఖజానా ఖాళీ అయిందని తెలిపారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రతో ప్రజల్లో చైతన్యం వచ్చిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. నియోజకవర్గం నుంచి కూడా ఈ సారి గెలిచి అసెంబ్లీకి వెళ్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి మండల నాయకులు బూదూరు మల్లికార్జున రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మనోహర్ రెడ్డి, చావిడి వెంకటేష్, వట్టేప్ప గారి నరసింహ, మేకల నరసింహ పాల్గొన్నారు. **ఆదోని** మండలంలోని ఆరేకల్ గ్రామంలో కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు గుడిసె కృష్ణమ్మ, మదిరె భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సౌదీ రావూఫ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, మల్లికార్జున, బిటి.శ్రీనివాసులు, మల్లేష్, శ్రీనివాసులు, హనుమాన్, పక్కీరప్ప, బసాపురం శివయ్య స్వామి, నారాయణపురం షేక్షావలీ, ఎడవల్లి యాసీన్ బాష, నాయకులు ఉన్నారు. **గోనెగండ్ల**లో చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా టిడిపి కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. నాయకులు బేతాళ బడేసా, ఎన్‌వి.రామాంజనేయులు, శ్రీధర్ నాయుడు, రంగస్వామి నాయుడు, మదీనా, నూర్ అహ్మద్, కొత్తింటి ఫక్రుద్దీన్, లక్ష్మీకాంత్, మల్దకల్, రహమతుల్లా, రంజాన్ పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)**లోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేష్ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుమారుడు పాలకుర్తి సత్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. టిడిపి నాయకులు నాడిగేని అయ్యన్న, పెండ్యాల భరద్వాజ శెట్టి, కృష్ణా రెడ్డి, చిన్న బొంపల్లి నర్సింహులు, వీరారెడ్డి, ఎంపిటిసి రాజు, బెళగల్ రామయ్య పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఆదోనిలో కేక్ కట్ చేస్తున్న గుడిసె కృష్ణమ్మ, సీనియర్ నాయకులు

మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కోసిగిలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

పేదింటి ఆడబిడ్డ వివాహానికి ప్రిన్స్ వహాబ్ ఆర్థిక సాయం

- 40 రకాల స్టీల్ సామాన్లను పెళ్లి కానుకగా అందజేత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సంపాదించిన దాంట్లో కొంతైనా దానం చేయాలని మనస్ఫూర్తిగా నమ్మి ఆచరిస్తున్నారు పట్టణానికి చెందిన ప్రిన్స్ వహాబ్. పట్టణానికి చెందిన ఓ ఆడబిడ్డ తండ్రి తన కుమార్తె వివాహానికి ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు, ఎఆర్ స్పోర్ట్స్ అధినేత వహాబ్‌ను ఆశ్రయించారు. స్పందించి ఆయన తన సొంత నిధులతో రూ.25 వేల విలువ చేసే వంటకు సరిపడ 40 రకాలకు పైగా స్టీల్ సామగ్రిని కొనుగోలు చేశారు. పట్టణంలోని అజంతా ఫంక్షన్ హాలులో గురువారం సామగ్రిని కొనుగోలు చేసి వివాహానికి 8 రోజులు ముందుగానే వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆడబిడ్డ తండ్రి ఆజాం మాట్లాడారు. క్లిష్ట సమయంలో తన కుమార్తె వివాహానికి ప్రిన్స్ వహాబ్ ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారని తెలిపారు. సేవా సమితి సభ్యులు మాచాని స్కూల్ మాజీ ఎఐ వైకుంఠ వాసు, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, ఉపాధ్యాయులు వెంకటేష్, రెహ్మాన్, హీరో కృష్ణ, మహేష్ ఫ్యాన్స్ సీనియర్ నాయకులు ఎంఎస్.వాసు, తారక్ పాల్గొన్నారు.

ఆడబిడ్డ తండ్రికి అందజేస్తున్న వహాబ్

బాధితులకు ప్రదీప్ రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - మంత్రాలయం

బాధితులను పరామర్శిస్తున్న ప్రదీప్‌రెడ్డి

ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి చికిత్స పొందుతున్న ఖాజా హుస్సేన్‌ను, అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాలయ్యను వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకులు వై.ప్రదీప్ రెడ్డి గురువారం పరామర్శించారు. స్థానిక వ్యవసాయ పరపతి సంఘం సిఇఒ ఖాజా హుస్సేన్ ఇటీవల చిలుకలడోన గ్రామ సమీపంలో ఉన్న బారికేడ్లను ద్విచక్ర వాహనంతో ఢీకొని గాయపడ్డారు. కర్నూలు నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖాజా హుస్సేన్‌ను, అలాగే ఓమ్ని ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బసలదొడ్డి గ్రామానికి చెందిన బాలయ్య ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. విషయం తెలుసుకున్న ఆయన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కర్నూలుకు వెళ్లి చికిత్స పొందుతున్న ఇరువురిని పరామర్శించి అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. వైసిపి మండల నాయకులు బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి, కాంతా రెడ్డి ఉన్నారు.

భూసర్వేలో లోపాలను అధిగమించాలి

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్న భూ సర్వేలో ఎదురవుతున్న లోపాలను అధిగమించి పరిష్కరించాలని రెవెన్యూ కార్యదర్శులకు, విలేజ్ సర్వేయర్లకు తహశీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ సర్వేలో ఎదురవుతున్న సమస్యలను జిల్లా వరకు రానివ్వకుండా మండల స్థాయిలోనే పరిష్కరించేలా కృషి చేయాలని జెసి నారపురెడ్డి మౌర్య ఆదేశించారని తెలిపారు. సర్వేలో తేలిన మిగులు భూములను పూర్తి అవగాహనతో ఆ కుటుంబం పూర్వాపరాలు, వంశ వృక్షం తెలుసుకున్న తర్వాతే పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సమస్యలపై రైతు అడిగిన వారికి పూర్తి అవగాహన కల్పించేలా ఉండాలన్నారు. డిటి గుండాల నాయక్, సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి, విఆర్‌ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : వైసిపి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

భూమి పూజ చేస్తున్న మురళీమోహన్ రెడ్డి

మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గ్రామాలాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని నేలకోసిగిలో సర్పంచి పశువుల హనుమంతమ్మ అధ్యక్షతన రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముఖ్యఅతిథిగా మురళీ మోహన్‌రెడ్డి హాజరయి మాట్లాడారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజల అభ్యర్థన మేరకు చేపట్టాల్సిన పనులకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఇంకా అవసరమైతే ఎమ్మెల్యే సొంత నిధులతో పనులను చేపడతారని చెప్పారు. పిఆర్ ఎఇ యుగంధర్ రెడ్డి, ఎంపిపి ఈరన్న, మహంతేష్ స్వామి, నాడిగేని నాగరాజు, జగదీష్ స్వామి, జంపాపురం బసిరెడ్డి, కాల్వ లక్ష్మయ్య, నేలకోసిగి లక్ష్మన్న, వీరేష్, గానుగ వీరస్వామి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌సి చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

పేదల భూముల్లో భూసేకరణ ఆపాలి

- పొలాల్లో రైతులతో కలిసి సిపిఎం, రైతు సంఘం వంటావార్పు, దీక్ష
- ప్రత్యామ్నాయ భూముల్లో జాతీయ రహదారిని చేపట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

పొలాల్లోనే టెంటు వేసి ఆందోళన చేస్తున్న బాధిత రైతులు, సిపిఎం, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల నుండి జమ్మలమడుగు జాతీయ రహదారి నిర్మాణం కోసం పేదల భూముల్లో భూసేకరణ తక్షణమే ఆపాలని, సర్వే చేయడానికి అధికారులు వస్తే బాధిత రైతులతో కలిసి అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్ హెచ్చరించారు. నంద్యాల నుండి జమ్మలమడుగు జాతీయ రహదారి నిర్మాణం కోసం కానాల, రైతు నగరం గ్రామాల్లో పేద రైతుల భూములను తీసుకోడాన్ని నిరసిస్తూ గురువారం ఎపి రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో రెండు గ్రామాల బాధిత రైతులు తమ భూముల్లో శిబిరం వేసుకొని, అక్కడే వంటా వార్పు చేసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పేద రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ధనవంతులు, అధికార పార్టీ నాయకులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తుల ఆస్తులు కాపాడడం కోసం, వారి భూములకు విలువ పెంచేందుకు జాతీయ రహదారి భూసేకరణకు మొదట్లో ప్రతిపాదించిన ప్లాన్‌ను మార్చివేశారని తెలిపారు. నిరుపేదలమైన తమ భూముల్లో రహదారి వచ్చే విధంగా గజిట్ రూపొందించారని, ఈ గజిట్ వల్ల తాము జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మా అభ్యంతరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం లెక్కచేయకుండా మా పొలాల్లో సర్వే చేసి మార్కింగ్ వేస్తున్నారని వాపోయారు. ఇది చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులకు సిపిఎం, రైతు సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడారు. ప్రత్యామ్నాయ భూముల్లో జాతీయ రహదారి వేయడానికి అవకాశం ఉన్నా, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరుపుకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, పేద రైతుల భూముల్లో సర్వే చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల పట్ల ఏ మాత్రం ప్రేమ, అభిమానం, చిత్తశుద్ధి ఉన్నా వెంటనే కానాల, రైతు నగరం గ్రామాల్లో గ్రామ సభలు జరిపి, అభిప్రాయాలను తెలుసుకొని, పేద రైతులకు తక్కువ నష్టం కలిగేలా ప్రత్యామ్నాయ భూముల్లో రహదారిని నిర్మించి న్యాయం చేయాలని కోరారు. అలా జరగని పక్షంలో రైతులందరితో కలిసి సర్వే పనులను అడ్డుకుంటామని, సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆ భూముల్లోనే దీక్షలో ఉంటామని స్పష్టం చేశారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ జోక్యం చేసుకొని పేద రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహ కారదర్శి బాల వెంకట్, టౌన్ కార్యదర్శి లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు లక్ష్మణ్, శివ, ఎస్ఎఫ్ఐ నాయకులు నిరంజన్, కిరణ్, కానాల, రైతు నగరం గ్రామ రైతులు శంకరరావు, మనోహర్, టి.వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, రామ చిన్నమ్మ, శర్మ తదితరులు పాల్గొన్నారు.

భరత జాతి ముద్దుబిడ్డ అంబేద్కర్

- ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

భరత జాతి ముద్దుబిడ్డ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో సర్పంచి మన్నే జ్ఞానాభరణం అధ్యక్షతన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిలు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎస్‌సి కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడని, కేవలం ఎస్సీ ఎస్టీలకు చెందిన వారిగా రాజ్యాంగం అంటే తెలియని వారు చెబుతుంటారని అన్నారు. అంటరానితనం, కుల వివక్ష, మనువాద సిద్ధాంతాలను ఎదిరించి, ఎన్నో అవమానాలు భరించి ఆయన భరత జాతి అభివృద్ధి కోసం కృషి చేశారని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించి భరతజాతికి ఓటు హక్కును సాధించారని చెప్పారు.

అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. భారతదేశంలోని ప్రతి కులానికి, ప్రతి జాతికి రిజర్వేషన్లు కల్పించాలని ప్రపంచ రాజ్యాంగాలను చదివి భారత రాజ్యాంగాన్ని తయారు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బాయికాటి బెనర్జీ, నంద్యాల తహశీల్దార్ బి.శ్రీనివాసులు, బండి ఆత్మకూర్ తహశీల్దార్ ఉమారాణి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు అనుబంధాలను పెంపొందిస్తాయి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్‌బాష

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రార్థనలో పాల్గొన్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, కలెక్టర్, ఎమ్మెల్యేలు

పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు ప్రజల మధ్య ఆత్మీయ అనుబంధాలను పెంపొందిస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్‌బి అంజాద్ బాషా తెలిపారు. గురువారం నంద్యాల పట్టణంలోని ఆర్‌కె కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లిములకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి ఎస్‌బి అంజాద్ బాషా, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, తోగూరు ఆర్థర్, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, జెసి టి.నిశాంతి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృత రాజ్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సలోమి, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో పాటు హిందూ, క్రైస్తవ సోదరులు కూడా భాగస్వాములై మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. ముందుగా మంత్రి, కలెక్టర్‌లు ముస్లిం సంప్రదాయ రీతిలో ప్రార్థన చేసి ఉపవాస దీక్షను విరమింపచేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, మైనారిటీ నాయకులు, మత గురువులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

శుక్రవారం
ఇఫ్తార్ : 6 : 39
సహేరి : 4 : 35

మండుతున్న ఎండలు..

- బెంబేలెత్తుతున్న ప్రజలు
- ప్రత్యామ్నాయ పద్ధతులతో వ్యవసాయ పనులు
- డాక్టర్ల సలహాలు పాటించాలంటున్న అధికారులు
- గొడుగులతో పశువుల కాపరులు

టోపీలు ధరించి వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - రుద్రవరం

రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. ప్రజలు బయటకు రావాలంటేనే బెంబేలెత్తుతున్నారు. భానుడి ప్రతాపానికి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు నమోదు అవుతుండడంతో వ్యవసాయ కూలీలు సైతం పనులు చేసుకోవడానికి భయపడుతున్నారు. రుద్రవరం మండలంలో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుము, పసుపు తదితర పంటలను కోత కొయ్యడానికి ప్రత్యామ్నాయ పద్ధతులను పాటిస్తున్నారు. కూలీలతో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనులు చేయిస్తున్నారు. కూలీలు టోపీలు, పొడవైన చొక్కాలు, రుమాలు ధరించి ఎండ బారిన పడకుండా పనులు చేస్తున్నారు. పశువుల కాపరులు పశువులను పొలాలలో మేపుకోవడానికి వెళ్లి అక్కడ ఎండ పడకుండా ఉండేందుకు గొడుగులను రక్షణగా ఉపయోగిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఎండ బారి నుండి తమ పశువులను కాపాడుకోవడానికి వంకలు, వాగుల్లో నిలిచి ఉన్న నీటిలో గేదెలను దింపి ఉపశమనం కల్పిస్తున్నారు. కొద్దిసేపు నీటిలోనే ఉంచుతున్నారు. కొందరు గొర్రెలు, మేకలకాపరులు పెద్ద పెద్ద చెట్ల కింద నీడలో నిలిపి ఎండవేడిమి తగ్గేవరకు గుంపుగా ఉంచుతున్నారు. విద్యార్థులు మధ్యాహ్నం పాఠశాల ముగియగానే గ్రామ సమీపంలోని వ్యవసాయ బావుల్లో ఉన్న నీటిలో ఈత కొడుతూ ఉపశమనం పొందుతున్నారు.

ఇలాంటి ఎండలు ఎన్నడూ చూడేలదు

ఇలాంటి ఎండలు ఎన్నడూ చూడలేదు. ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఎండ బారిన పడకుండా ఉండేందుకు గొడుగు వాడుతున్నాను. గొడుగు వాడటం వల్ల ఎండ తగలడం లేదు. రోజూ ఇలాగే గొడుగు కింద ఉండి గేదెలను మేపుకుంటున్నాను. గేదెలు కూడా ఎండ వేడిమి నుంచి ఉపశమనం వాగుల్లో ఉన్న నీటిలో కొద్దిసేపు ఉంచుతున్నాం.

- నాగరాజు పశువుల కాపరి, చిన్న కంబలూరు గ్రామం.

నీటిలో దిగి ఉపశమనం పొందుతున్న గేదెలు

చెట్టు కింద సేద తీరుతున్న గొర్రెలు

గొడుగు పెట్టుకుని గొర్రెలను మేపుతున్న మహిళ

ఈత కొడుతున్న విద్యార్థులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

సిఎంను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గురువారం విజయవాడలో ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నంద్యాల విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్‌వి జగన్మోహన్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. సిఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సిఎంతో చర్చించారు.

సర్పంచి ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని ఎస్.లింగందిన్నె గ్రామంలోని మసీదులో ముస్లిం సోదరులకు సర్పంచ్ ఇరిగెల విశ్వనాథ్ రెడ్డి గురువారం ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం తమ అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఇరిగెల కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయి వివాహానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పట్టణంలోని పేదింటి అమ్మాయి వివాహానికి డాక్టర్ రామిరెడ్డి సేవాసమితి వ్యవస్థాపకులు డాక్టర్ రామిరెడ్డి గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఎల్‌ఎం కాంపౌండ్‌లో నివసిస్తున్న కుమార్ కుమార్తె శ్రావణి వివాహానికి డాక్టర్ రామిరెడ్డి రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, సరోజ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేస్తున్న డాక్టర్ రామిరెడ్డి

చెవి రంధ్రానికి కుట్టులేని ఎండోస్కోపి సర్జరీ

- చెవి ముక్కు గొంతు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అరుదైన శస్త్ర చికిత్సలకు నిలయం ప్రగతి చెవి, ముక్కు, గొంతు ఆసుపత్రి. ఈ ఆసుపత్రి స్థాపించిన అతి తక్కువ సమయంలోనే చెవి, ముక్కు, గొంతుకు పలు రకాల అత్యాధునిక సాంకేతిక అరుదైన శస్త్ర చికిత్సలను చేశారు. ఇటీవల కాలంలోనే కర్ణభేరికి రంధ్రం పడితే ఎలాంటి కోత, కుట్లు లేకుండా ఎండోస్కోపీ ద్వారా అరుదైన శస్త్ర చికిత్సను చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ చేశారు. చెవికి సంబంధించి శస్త్ర చికిత్స విషయాలను ఆయన మాటల్లోనే...

'కర్ణభేరికి రంధ్రం పడి చీము కారుతుంది. గతంలో అయితే చెవి వెనుక భాగంలో కోత పెట్టి చికిత్స చేసేవారు. ప్రస్తుత పరిస్థితులలో నూతన టెక్నాలజీని ఉపయోగించి చెవి రంధ్రానికి కుట్టులేకుండా ఎండోస్కోపి ద్వారా సర్జరీ చేయవచ్చు. ఇప్పటికే ప్రగతి ఆసుపత్రిలో దాదాపు 15 నుండి 20 వరకు ఎండోస్కోపి ద్వారా సర్జరీలు చేశాం. చెవి నిర్మాణంలో మూడు భాగాలు ఉంటాయి. బాహ్య చెవి, మధ్య చెవి, అంతర్ చెవి. బాహ్య చెవిలో మధ్య చెవిని విభజిస్తూ సున్నితమైన పలుచటి కర్ణబేరి పొర ఉంటుంది. ఈ కర్ణభేరికి రంధ్రం పడటం వల్ల మధ్య చెవి నుండి చీము కారుతుంది. దానికి శస్త్ర చికిత్స చేయాలంటే చెవి వెనుక భాగం రంధ్రం చేసి చేసేవారు. ఫలితంగా కుట్లు, పుండు మానకుండా ఎక్కువ రోజులుండేది, ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా అత్యాధునిక టెక్నాలజీతో ఎండోస్కోపిని ఉపయోగించి సింపుల్‌గా సర్జరీ చేస్తున్నాం. తద్వారా ఎలాంటి ఇబ్బందులుఉండవు. చెవికి కుట్టు అనేదే ఉండదు. కర్ణభేరికి రంధ్రం వల్ల మధ్య చెవి నుండి చీము కారుతుంది. దీనిని క్రానిక్ సుప్యూరేటల్ ఓటైటిస్ మీడియా అంటారు. దీనిలో రెండు రకాలు. మొదటిది సురక్షితమైనది. రెండవది ప్రమాదకరమైనది.

సురక్షితమైన క్రానిక్ సుప్యూరేటల్ ఓటైటిస్ మీడియా : మధ్య చెవిలో ఇన్ఫెక్షన్ వ్యాపించి చీము తయారై కర్ణభేరికి రంధ్రం ఏర్పడి బయటకు వస్తుంది. ఈ నీరులా, వాసన, రక్తం లేకుండా చాలా ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధికి శస్త్ర చికిత్స ద్వారా చీము రాకుండా చేసి బాగా వినపడేలా చేయడానికి అవకాశం ఉంది. ఈ శస్త్ర చికిత్సని టీంపనొప్లాస్టి అంటారు. ఎండోస్కోపీ ద్వారా చెవి వెనుక భాగంలో కోత లేకుండా డ్రాగన్ మృదులాస్థితో చేయవచ్చు. అయితే ఈ ఆపరేషన్ సురక్షితమైన క్రానిక్ సుప్యూరేటల్ ఓటైటిస్ మీడియా వ్యాధికి పరిమితమైన, ప్రమాదకరమైన క్రానిక్ సుప్యూరేటల్ ఓటైటిస్ మీడియా వ్యాధికి మాత్రమే చేయగలం' అని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు.



తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆవాజ్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల

ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు బాబుల్లా ఆధ్వర్యంలో గురువారం 300 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన బాబుల్లాను అభినందించారు. బాబుల్లా మాట్లాడుతూ ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా, సహాయం కావాలన్నా తాము ముందు ఉంటానని అవాజ్ నాయకులు తెలిపారు. అవాజ్ కమిటీ గౌరవాధ్యక్షులు ఎస్‌ఏ. గఫూర్, కుదుస్, బాబ్జి, బబ్లు, హుస్సేన్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్ కిట్ల పంపిణీ : నారాయణ స్కూల్ ఆధ్వర్యంలో డాక్టర్ వి. యాఖుబ్, వారి సోదరులు వి.ఇసాక్ వలి నిరుపేదలకు జకాత్ రూపంలో 100 ఈద్ కిట్లు గురువారం పంపిణీ చేశారు. ముఖ్య అతిధులుగా ప్రముఖ ముస్లిం మత పెద్దలు ఇద్రుస్ మౌలానా, బషీర్ మౌలానాలు హాజరై మాట్లాడారు. నారాయణ పాండే, శ్రీసాయి వాణి స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ భాష, యూసుఫ్, అక్బర్ మౌలానా, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యువగళం @ 1000

- లోకేష్ పాదయాత్రలో మైలురాయి
- నేడు ఆదోనిలో శిలాఫలాకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వెయ్యి కిలోమీటర్ల మైలురాయికి శుక్రవారం చేరుకోనుంది. జనవరి 27న చిత్తూరు జిల్లా కుప్పం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. 77 రోజుల పాటు 27 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పాదయాత్ర సాగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఉమ్మడి అనంతపురంలో 9 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగిన యువగళం పాదయాత్ర 77వ రోజు ఆదోనిలో వెయ్యి కిలోమీటర్ల మైలురాయిని చేరుకోనుంది. 400 రోజుల్లో 4వేల కిలోమీటర్లు చేరుకోవాలని పాదయాత్ర ప్రారంభించిన లోకేష్ రోజుకు సగటున 10కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించాలని తొలుత నిర్ణయించగా, లక్ష్యానికి మించి ఇప్పటి వరకు సగటున రోజుకు 13 కిలోమీటర్లు నడక సాగించారు. పలువురు లోకేష్‌ను కలిసి సమస్యలు చెబుతుండగా, మరికొందరు వినతిపత్రాల రూపంలో సమస్యలు తెలియజేస్తున్నారు. వివిధ వర్గాల ప్రజల నుంచి ఇప్పటివరకు 1,300 వినతిపత్రాలు యువనేతకు అందాయి. యువత, మహిళలు, రైతులు, వ్యాపారులు, ఐటి ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, వివిధ సామాజికవర్గాల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశాలు ఏర్పాటు చేస్తూ అధికారంలోకి వస్తే ఆయా వర్గాలకు తాము ఏం చేస్తామన్నది లోకేష్ హామీ ఇస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో నిర్వహించే బహిరంగ సభలో ఆయా ఎమ్మెల్యేల అవినీతి గురించి ప్రశ్నిస్తున్నారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. మంత్రి గుమ్మనూరు జయరాం భూ కబ్జా బాగోతాలు, కర్ణాటక మద్యం అక్రమ వ్యాపారాన్ని బయటపెట్టారు. ప్రభుత్వ ధర ప్రకారం 180 ఎకరాల ఇట్టినా భూములను కొనుగోలు చేసి రైతులకు అందిస్తామని బెంజి మంత్రిని ఇరకాటంలో పెట్టారు.

13 కమిటీలతో ముందుకు..

యువగళంలో మొత్తం 13 కమిటీలు పనిచేస్తున్నాయి. పాదయాత్ర మెయిన్ కోఆర్డినేటర్‌గా కిలారు రాజేష్, అధికార ప్రతినిధులుగా ఎంఎస్ రాజు, దీపక్ రెడ్డి, భోజన వసతుల కమిటీగా మద్దిపట్ల సూర్యప్రకాష్, లక్ష్మీపతి, వాలంటీర్ కోఆర్డినేషన్ కమిటీగా రవి నాయుడు, ప్రణవ్ గోపాల్, రూట్ కోఆర్డినేషన్ కమిటీగా రవి యాదవ్, అడ్వాన్స్ టీమ్ కమిటీగా డూండీ రాకేష్, నిమ్మగడ్డ చైతన్య, శ్రీరంగం నవీన్ కుమార్, ప్రత్తిపాటి శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. వసతి ఏర్పాట్ల కమిటీగా జంగాల వెంకటేష్, నారా ప్రశాంత్, లీలా, శ్రీధర్, ఐనంపూడి.రమేష్, యువగళం పిఆర్ టీమ్‌గా మునీంద్ర, కిషోర్, కృష్ణారావు, సోషల్ మీడియా కోఆర్డినేషన్‌గా కౌశిక్, అర్జున్, అలంకరణ కమిటీగా మలిశెట్టి వెంకటేశ్వర్లు, బ్రహ్మం, రూట్ వెరిఫికేషన్ కమిటీగా అమర్నాథ్ రెడ్డి, కస్తూరి కోటేశ్వరరావు, తాగునీటి సదుపాయం కోసం భాస్కర్, వెంకట్ పనిచేస్తున్నారు.

ఆదోని 21 వార్డు దత్తత కోసం హామీ

పాదయాత్రలో ప్రతి వంద కిలోమీటర్ల మైలు రాయికీ ఒక హామీతో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న లోకేష్ శుక్రవారం వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని ఆదోనిలో ఆవిష్కరించనున్నారు. అధికారంలోకి రాగానే ఆదోని 21వ వార్డును దత్తత తీసుకోనున్నట్లు హామీ ఇవ్వనున్నారు. తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇవ్వనున్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర నాయకురాలు కె. రంగమ్మ

మహిళలకు రక్షణ ఎక్కడ : ఐద్వా

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించాలని దిశ యాప్ కింద కఠినంగా శిక్షించి మహిళలకు రక్షణ కల్పించాలని ఒకపక్క ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి చెపుతున్నప్పటికీ జూపాడు బంగ్లా మండలంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దౌర్జన్యాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనిఐద్వా రాష్ట్ర నాయకురాలు కె. రంగమ్మ, జిల్లా అధ్యక్షురాలు అమ్మ ఆర్.జయ మాధవి ప్రశ్నించారు.గత 15వ తారీఖున జూపాడుబంగా మండలం పార్మంచాల గ్రామంలో ఎం.లలితమ్మన్ పూర్తిగా మద్యం సేవించి చెప్పలేని విధంగా రాయలేని విధంగా దుర్భాషలాడి దాడికి ప్రయత్నించిన మురారి, నవీన్,మురారి, రత్నమ్మ, సౌమ్య పై చట్టపరమైన కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం ఏమిటని అన్నారు. జూపాడు బంగ్లా సెంటర్‌లో మదర్ బీనీ ఇంటిని కొచ్చి దుర్భాషలాడే మదర్ బి కూతురును భర్తను దౌర్జన్యంగా దాడి చేసిన వారిపై 16వ తారీఖు జూపాడు బంగ్లా మండల ఎస్ఐకి ఫిర్యాదు చేసినా ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా జూపాడు బంగ్లా మండల ఎస్ఐ వారు స్పందించి వీరిపై కేసు నమోదు చేయకపోతే మహిళా సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్‌సి స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆత్మకూరు

నందికొట్కూరు పట్టణంలో ఎస్సీ విద్యార్థులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఎపి ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి డక్క కుమార్ గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డక్క కుమార్ మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్లో మెనూ సక్రమంగా అమలు చేసి, ప్రైమరీ హాస్టల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జనార్ధన్, వంశీ పాల్గొన్నారు.

మలేరియా పట్ల అప్రమత్తం అవసరం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణయ్య అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా బేతంచెర్ల పట్టణంలోని బనగానపల్లె రోడ్డులో గల కస్తూర్బా విద్యాలయం నందు మలేరియా వ్యాధి గురించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రిన్సిపల్ ఉషా చేతుల మీదుగా అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ రామాం జనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

అగ్నిమాపక వారోత్సవాలను గురువానం అగ్ని మాపక కేంద్రం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అగ్నిమాపక అధికారి భీముడు నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిఎం మహేంద్రుడు మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలను గూర్చి అగ్నిమాపక కేంద్ర సిబ్బంది గత వారం రోజులుగా ప్రజలలో అవగాహన కల్పిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీ యమన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు ఎన్ఎస్ సయ్యద్ మీర్, ఆర్టీసీ డిపో ఏఎంఎఫ్ సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్ యూనిస్, నాయకులు అహ్మద్ రసూల్, కలీముల్లా, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

ముగింపు కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు అధికారులు

నిరంకుశ బిజెపిని ఓడించాలి : సిపిఎం

ఆత్మకూరు : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి యేసు రత్నం

ప్రజాశక్తి - ఆత్మకూరు

నిరంకుశ బిజెపి పాలనను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసురత్నం పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ, సిపిఎంలు చేపట్టిన ప్రచారభేరి గురువారం ఆత్మకూరు పట్టణంలో మూడవ రోజు సాగింది. వాకిటి పేట, రాజా వీధి, ఎస్‌పిజి పాలెం, ఏబీఎన్ పాలెం, గొల్లపేట, వడ్లపేట, కల్లా విధి, కొత్తపేట మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం, సిపిఐ కార్యదర్శి కె. శ్రీనివాసులు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలు వేస్తూ లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వారికి దారాదత్తం చేస్తోందన్నారు. రాష్ట్రంలో గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును సైతం ప్రైవేటు వారికి అప్పజెప్పే ప్రయత్నం జరుగుతోంద న్నారు. రాష్ట్రానికి విభజన సమయంలో ఇచ్చిన హామీలు ఏమాత్రం నెరవేర్చడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విచ్చలవిడిగా పన్నుల మీద పన్నులు వేస్తూ ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తోందన్నారు. ఈ సమస్యలన్నిటిని ప్రజల దగ్గరికి తీసుకుపోయి ఆ ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో ఓడించాలని వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డిఎం. రజాక్, బి ఎస్ వలి, పి. సుధాకర్, వీరన్న,ఎన్. స్వాములు, డి. రామ్ నాయక్, సద్దాం హుసేన్ జాబిల్లా,సిపిఐ నాయకులు, అతావుల్లా, ప్రతాప్, వెంకట శివుడు, అహమ్మద్ హుసేన్, తాజుద్దీన్,మహిళా సమాఖ్య నాయకురాలు స్వాతి, ప్రశాంత కుమారి,కార్యకర్తలు పాల్గొన్నారు. **బేతంచెర్ల:** సిపిఎం సీనియర్ నాయకులు వై ఎల్లయ్య, మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య, పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బనగానపల్లె–డోన్ సర్కిల్ నందు ప్రచార భేరి పాదయాత్ర నిర్వహించారు. అంతుకుముందు స్థానిక రైల్వే గేట్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. దుర్గా పేట, బి ఆర్ పేట, వడ్డేపేట బోయపేట తహసిల్ పేటల నందు పాదయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో రాజబాబు, నాగరాజు, నరసింహ, వెంకట రమణ, ఆంజనేయులు, అంకాలు, బద్రి, ఓబులేష్, చిన్న వెంకటేశు, చిన్నబీ ,బి నాగరాజు,చిన్న నరసింహులు, పెద్ద నరసింహ పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్:** సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సింగవరం, ఈర్నపాడు, కడమల కాలువ గ్రామాల్లో ప్రచారం భేరి నిర్వహించారు. మండల కార్యదర్శి రత్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, డివైఎఫ్ఐ నాయకులు రాజేష్, నాయకులు రాజశేఖర్, అశోక్, ఏసన్న, ఇమ్మానియేల్ పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ప్రధాని మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో దొర్నిపాడులో ప్రచార బేరి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాముడు మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, సిపిఐ రుద్రవరం మండల కార్యదర్శి నరసింహులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్లలో..

గ్యాస్ నిక్షేపాలకు ఒఎన్‌జిసి సర్వే

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలో గ్యాస్ ఆయిల్ నిక్షేపాల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆయిల్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జిసి) ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. గురువారం చాగలమర్రి మండల పరిధిలోని బ్రాహ్మణ పల్లె మద్దూరు పరిసర ప్రాంతాలలో భూగర్భము బోర్లను విరివిగా వేసి గ్యాస్ నిక్షేపాల తరంగాలను వెతుకుచున్నామని ఓఎన్‌జిసి సమాచార అధికారి సత్యబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, నంద్యాల జిల్లాలలోని చాగలమర్రి, పెద్దముడియం, మైదుకూరు, జమ్మలమడుగు, రాజుపాలెం మండలాల్లోని భూములలో గ్యాస్ నిక్షేపాలు అధికంగా ఉన్నాయని అందుకు సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మండలంలో సుమారు ఇప్పటివరకు 500 నుండి 7 వందల బోర్లు వేయడం జరిగిందన్నారు. ఒక్కో బోర్‌లో 50 అడుగుల చొప్పున గ్యాస్ ఆయిల్ నిక్షేపాల తరంగాలను గుర్తించి ఓఎన్‌జిసి సెంట్రల్ ప్రభుత్వ కార్యాలయం డెహ్రాడూన్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం వందమంది సిబ్బంది నలుగురు భూగర్భ పరిశోధకులు పనిచేస్తున్నా రన్నారు. ఈ సందర్భంగా ఒన్‌జిసి ప్రతినిధి బృందం సభ్యులు సత్య బాబు,రాంప్రసాద్, నాగరాజు, నూకరాజు బృందంతో కూడిన సస్పిక్ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గ్యాస్ నిక్షేపాల కోసం 2018లో హెలికాప్టర్లో, ఎయిర్ క్రాఫ్ట్ సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఆ సర్వే ఆధారంగా ఈ పొలాలలో 50 అడుగుల చొప్పున నిక్షేపాల తరంగాలను గుర్తించడం జరుగుతుం దన్నారు. చాగలమర్రి మండలం మొత్తం సర్వే నిర్వహించడం జరుగుతుం దని వారు వివరించారు.

బ్రాహ్మణ పల్లెలో గ్యాస్ ఆయిల్ నిక్షేపాల కోసం సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

నేడు జాతీయస్థాయి త్రోబాల్ పోటీలు

ప్రజాశక్తి చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 21వ తేదీన జాతీయ స్థాయి జూనియర్స్ విభాగం త్రోబాల్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్న ట్లు ఆంధ్రప్రదేశ్ త్రోబాల్ కార్యదర్శి స్రవంతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మహబూబాబాషా గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ జూనియర్ పోటీలకు అర్హత కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఎంపికైన వారికి హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం ఉనలో జరిగే 33వ జూనియర్ త్రోబాల్ నేషనల్ చాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. పాల్గొనే విద్యార్థులు ఆధార్, 10వ తరగతి మార్కుల మెమో వెంట తీసుకురావాలని తెలిపారు.

25 నుండి ఉచిత సామూహిక సేవలు

ప్రజాశక్తి - శ్రీశైలం

ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ నుండి సామూహిక అభిషేకాన్ని చంద్రావతి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న గురువారం తెలిపారు. ధర్మ ప్రచారంలో భాగంగా ప్రతి మాసంలో ఒకరోజు తెల్ల రేషన్ కార్డు కలిగిన సామాన్య భక్తులకు సామూహిక సేవలను మొదటిసారిగా దేవస్థానం ప్రవేశపెట్టిందన్నారు. సేవలో పాల్గొనదలచిన భక్తులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. శ్రీశైల దేవస్థానం. ఓఆర్‌జి ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 19 నుండి భక్తులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. 250 టికెట్లు మాత్రమే అందుబాటులో ఉంటాయని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలో ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రమణయ్య వాహనదారులకు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ చాగలమర్రి పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ప్రజలు వాహనాలు ఇష్టానుసారంగా నిలిపేస్తే రహదారిపై ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాహనదారులు సహకరించి ట్రాఫిక్ నిబంధనల ప్రకారం రోజూ రహదారికి ఒకవైపు వాహనాలను నిలిపి వారివారి వ్యాపారాలు, ఇతర పనులు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయాలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వైద్యశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

శ్రీశైలం ప్రాజెక్టు : సుండి పెంటలోని ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎపి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లమోతుల మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి వైద్య సదుపాయాలపై మాట్లాడారు. గత సంవత్సరంలో నవంబర్ 22న కాలనీలోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అప్పటి సమావేశము నందు ఎక్సరే యంత్రం ఏర్పాటు,ల్యాబ్ టెక్నీషియన్ నియామకము పై ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. అలాగే గతంలో కేంద్ర ప్రభుత్వము నుండి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన కుటుంబ సంక్షేమ శాఖ డివిజనల్ డైరెక్టర్ వారి ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న ప్రజా సంఘాలతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు కమిటీ ఏర్పాటు చేయలేదని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన రోగులకు, వారి తోటి వచ్చిన బంధువులకు, వైద్య సిబ్బంది కూడా త్రాగడానికి మంచి నీరు కూడా కల్పించలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారన్నారు. ఇప్పటికైనా కాలనీలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

సచివాలయ ఉద్యోగులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ భాగలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని శెట్టివీడు,గొడెగనూరు,డి.వనిపెంట,ముత్యాలపాడు 1,2 సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - పాములపాడు

తుమ్మలూరు గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపటిన్నట్లు గ్రామ సర్పంచ్ వనమాల ప్రసాదరావు తెలిపారు. గురువారం నాడు జడ్పీహెచ్ హైస్కూల్ ఆవరణంలో ఉన్న బోరింగు, ఎస్సీ కాలనీలో ఉన్న బోరింగ్, కృష్ణ రావు పేట గ్రామంలో ఉన్న బోరింగ్‌లను రిపేర్ చేయించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.

సచివాలయంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలో వైద్యాధికారి అంజలి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని సచివాలయ పరిధిలో 104 వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మనోహర్, సూపర్వైజర్ రామలింగారెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు. **బేతంచెర్ల:** శాంతిరాం ఆస్పత్రి, శాంతిరాం సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెడికల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు వైష్ణవి, విజయలక్ష్మి అన్నారు. గురువారం బేతంచెర్ల పట్టణంలోని నాలుగవ సచివాలయంలోఉచిత మెడికల్ సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. 25 మందిని శాంతిరం హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి సుబ్రమణ్యం, మెడికల్ సిబ్బంది రమణ,వైవి రమణ, కిషోర్ బాబు ,ప్రభాకర్, వై సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎంకే జిలానికి నివాళ్లు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూర్ మేజర్ గ్రామ పంచాయతీ దివంగత సర్పంచ్ యం.ఏ.కే.జిలాని 13వ వర్ధంతిని ఆత్మకూర్ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు యం.ఏ.. రషీద్, వైసిపి నాయకులు మోమిన్ మునీర్ బాషా, మోమీన్ గౌస్అజమ్ కౌన్సిలర్, మోమీన్ మన్సూర్ అలీ, తదితరులు పూమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం యం. ఏ.కే.జిలాని కుమారుడు మోమిన్ మునీర్ బాషా అధ్వర్యంలో కరివేన గ్రామం సమీపంలోని ఎస్ ఆర్ బి సి కాలనీలో వృద్దా ఆశ్రమంలో పండ్లు, బ్రేడ్లు పంపిణీ చేశారు.

ఆధార్ నమోదు కేంద్రాన్ని తనిఖీ

ప్రజాశక్తి - పగిడ్యాల



ఆధార్ నమోదు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో వెంకటరమణ

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో వెంకటరమణ, ఈఓఆర్‌డి పుల్లయ్య గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లక్ష్మాపురం, సంకిరేణి పల్లె గ్రామంలో ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక ఆధార్ కార్డు కేంద్రంలో ఆధార్ కార్డు లేని వారు, పిల్లల ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకోవడం వీటికి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

శ్రీశైలంలో కేంద్రమంత్రి

ప్రజాశక్తి - శ్రీశైలం

దర్శనానంతరం బయటకు వస్తున్న కేంద్ర మంత్రి దంపతులు

శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను గురువారం నాడు కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ కుటుంబ సమే తంగా స్వామి అమ్మవాలను దర్శి ంచుకున్నారు. మీర దర్శనార్థమై ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయ అధికారులు ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేద పండితులు స్వాగతం పలికారు. ముందుగా స్వామివారిని, ఆ తర్వాత అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించు కున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఎఎన్‌ఎంను సస్పెండ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పగిడ్యాల

ఆశ వర్కర్‌ను వేధింపులకు గురిచేస్తున్న ఏఎన్ఎం సావిత్రిని తక్షణమే సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పగిడ్యాల పీహెచ్‌సిలో వైద్యాధికారి అనిల్ కుమార్‌కు సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల యూనియన్ వినిత పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడారు. నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో ఆశ వర్కర్ నజీరున్నిసా 17 సంవత్సరాల నుంచి ఆశ వర్కర్‌గా విధులు నిర్వహిస్తోందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 4వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్ నజీరున్నిసాను గత ఆరు నెలల నుంచి ఏఎన్ఎం సావిత్రి వేధింపులకు గురి చేస్తుందని ఆయన ఆరోపించారు. ఉన్నతాధికారులు పిలిపించి మందలించిన ఏఎన్ఎం తీరు మారలేదన్నారు. ఇటీవల నజీరున్నిసాను విధుల నుంచి తొలగించేసామని ఇంటికి వెళ్లి పోవాలని సావిత్రి వేధించడంతో ఆశవర్కర్ మనస్థాపానికి గురై ఆత్మహత్యా ప్రయత్నం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎన్ఎం సావిత్రిను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు బాబు, రామకృష్ణ, ఆశ వర్కర్లు సరోజిని, రమణమ్మ, శేషమ్మ రజిత

వైద్యాధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు, ఆశ వర్కర్ల

మహారాజశ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.యస్.నెం.920/2019

ఎన్.హరి నారాయణ. ...వాది

-ఎదురి -

బి.గురు ప్రసాద్ పోతి వారసులు బైసాని రాధమ్మ వగైరా ... ప్రతివాదులు

4వ ప్రతి వాదికి దావా సమన్లు

(4) జి.పావని భర్త సుధాకర్ ఇంటి. నెంబరు.6-56. అగ్రహారం వీధి ప్యాపిలి గ్రామం, కర్నూలు జిల్లా ప్రస్తుతం నంద్యాల జిల్లా.

పై నంబరు దావాలో వాది, ప్రతివాదుల నుండి దావా మొత్తం రూ.1,81,562/-లు ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు లేట్ బి. గురు ప్రసాద్ ఆస్తి నుండి రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినాడు. ఇందులో 4వ ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 15-6- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 15-6-2023

హెచ్.కె. జలంధర్ రావు,
జి.గోపాలకృష్ణయ్య,
పి.సత్యనారాయణ రెడ్డి,
వాదిపరం న్యాయవాదులు,
కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఐ.ఏ.నెం.108/2019 ఇన్

ఓ.యస్. నెం.920/2019

ఎన్.హరి నారాయణ.
...వాది/అర్జీదారు

-ఎదురి -

బి.గురు ప్రసాద్ పోతి వారసులు బైసాని రాధమ్మ వగైరా.
...ప్రతివాదులు/ రెస్పాండెంట్లు

4వ రెస్పాండెంట్ /ప్రతి వాదికి నోటీసులు

(4) జి.పావని భర్త సుధాకర్ ఇంటి. నెంబరు.6-56. అగ్రహారం వీధి ప్యాపిలి గ్రామం, కర్నూలు జిల్లా ప్రస్తుతం నంద్యాల జిల్లా.

పై నంబరు దావాలో వాది, దావా బాకీ వగైరాలు రాగోరి దావ దాఖలు చేస్తూ దావా బాకీ కి పూచికత్తుగా షెడ్యూల్ ఆస్తిని హెూల్ జప్తి కోరిఅర్జీ దాఖాలు చేసినాడు. ఇందులో 4వ రెస్పాండెంట్ అయిన నీకు ఆక్షేపణం ఉన్న 15-6- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు :-

కర్నూలు డి, కల్లూరు సబ్ -రిజిస్ట్రేషన్ జిల్లా, కల్లూరు మండలం జోహరాపురం గ్రామం, సర్వే.నెంబర్.150పైకి , ప్లాటు. నెం.291. విస్తీర్ణం :133.33చదరపు అడుగులు.
తూర్పు : 30 అడుగుల రోడ్డు
పడమర: ప్లాట్ నెంబర్.301 .
ఉత్తరం : ప్లాట్ నెంబర్. 290. దక్షిణం: ప్లాట్ నెంబర్. 292.
తూర్పు - పడమర 40 అడుగులు (18.2889మీటర్లు)
ఉత్తర - దక్షిణం : 20 అడుగులు (6.0960)

మార్కెట్ విలువ:రూ.2,50,000/-లు

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 15-6-2023

హెచ్.కె. జలంధర్ రావు,
జి.గోపాలకృష్ణయ్య,
పి.సత్యనారాయణ రెడ్డి,
వాది/అర్జీదారు పరం న్యాయవాదులు, కర్నూలు.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O. S. No.99/2021

అన్నపురెడ్డి శివశంకర్ రెడ్డి. ...వాది

V/S

ఆగోళ్ళ వెంకటసుబ్బయ్య,
తండ్రి పెద్ద సుబ్బరాయుడు,
H. No.3-13-102, కుద్బా వీధి,
ఆళ్లగడ్డ టౌన్ & మండలం.
కర్నూలు జిల్లా ప్రస్తుతం నంద్యాల జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి సమన్లు

పై నెంబర్ దావాలో వాది నీ పై ప్రామిసరీ నోటు బాకీ మొత్తం రాగోరి పై కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. కావున నీవు 01-05-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టునందు నీవు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై నీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై దావా నీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 01-05-2023

N.K.**వేణుగోపాల్,**
హెచ్ సి వి శేఖర్ బాబు,
వాదిపురం అడ్వకేట్స్,
ఆళ్లగడ్డ.

ఘనంగా చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలను డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నాయకులు,కార్యకర్తలతో కలిసి కేక్ కటింగ్ చేశారు. అనంతరం తెలుగుయువత ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి నందు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేశారు. పాత బస్టాండులో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఇంఛార్జుల పనితీరులో జోన్-5 35 నియోజకవర్గాలలో డోన్ 4వ స్థానం రావడంతో వలసల గ్రామ నాయకులు డోన్ నియోజక వర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డికి నాయకులు పూలమాలలతో సన్మానించారు. మండలం పార్టీ పని తీరులో కస్టర్ పని తీరులో 2వ స్థానం నిలిచినందుకు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్‌ని డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ, డోన్ నియోజకవర్గ సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్,నంద్యాల జిల్లా తెలుగుదేశంపార్టీ అధికారప్రతినిధి విజయ్ భట్, నంద్యాల జిల్లా తెలుగుదేశంపార్టీ బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున,డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు,డోన్ పట్టణ టిడిపి సమన్వయ కమిటీ చైర్మన్ ఆలా మల్లిఖార్జున రెడ్డి,అడ్వకేట్ లక్ష్మిశెట్టి క్రిష్ణ ప్రసాద్, క్లస్టర్ ఇంచార్జి గోవిందు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** స్థానిక టిడిపి కార్యాలయంలో చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీనాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్ నందు బ్రేడ్లు పంపిణీ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు వంగాల శివరామి రెడ్డి, కంచర్ల గోవింద రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్లాపురం బాషా, ఫకృద్దిన్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నాఘుర్ ఖాన్, తెలుగు యువత రాష్ట్ర జనరల్ సెక్రటరీ వెన్నా శ్రీధర్ రెడ్డి, నంద్యాల జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సి.కలిముల్లా, నంద్యాల జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిరాజు, తిరుపతయ్య, శాబుద్దీన్, పుల్లా రెడ్డి, రామ కృష్ణ, రమేష్ గౌడ్, న్యామతుల్లా, చిన్న, అన్వర్, ఇరగదిండ్ల మురళి, శివా రెడ్డి, వెంకట్రాముడు, నబీ, సుదర్శన్, సుబ్బా రాజు, శరత్, ఎస్తేరు, శ్రీనివాసులు, అమ్రుల్లా, మున్నా, జలీల్, షఫీ పాల్గొన్నారు.

నందికొట్కూరు టిడిపి నియోజకవర్గం అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి అధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల యందు రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. **కొత్తపల్లి:** మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న సరస్వతి పాఠశాల ఆవరణంలో టిడిపి మండల నాయకులు కెవి శివారెడ్డి నాగ శేషన్న, లింగ స్వామి గౌడ్‌ల ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను చిన్నారుల మధ్య నిర్వహించిచారు. టిడిపి నాయకులు నాగేశ్వరరావు యాదవ్, పోత నారాయణ, సుధాకర్, పుల్లన్న, శంకర్, శ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు. **బేతంచర్ల:** టిడిపి అధినేత చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా పాత బస్టాండ్ నందు టిడిపి పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి,డోన్ నియోజకవర్గం గౌరవ సలహాదారులు తిరుమలేశ్ చౌదరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ప్రజలకు మిఠాయిలు పంచారు. ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాయక్, ఎం రమేష్, కౌన్సిలర్లు రామాంజనేయులు, రామ్ గోపాల్ ,రామ్మూర్తి, నంద్యాల మధు, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి సి రాముడు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వంశి, లోకేష్ గౌడ్, శ్రీధర్, ముళ్ళ, మలిపెద్ది నాగేశ్వర్ రెడ్డి, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి:** స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ రాఘవేంద్ర మండల, పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య, సుంకయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. మైనారిటీ నాయకుడు ఖాజా పీర్,సుదర్శన్, కొంగనపల్లి మధు,ధనం మధు,బ్యాంకు శీను,సలాం, ప్రసాద్, రాంమోహన్ పాల్గొన్నారు. **పగిడ్యాల:** చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను మండలంలోని నెహ్రు నగర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు హేమ సుందర్ రాజు, రవి చౌదరి, అశోక్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. టిడిపి నాయకులు చాపల వెంకటేశ్వర్లు, రోడ్డు కాటి వెంకటేశ్వర్లు , పకీరయ్య, శ్రీనివాసులు, జనార్ధన్, బండారు శ్రీను, గౌడు, జయేంద్ర గౌడు, గడ్డి గోపుల వెంకటేశ్వర్లు, మద్దిలేటి, రామ్, అర్లపాటి మద్దిలేటి, రాము టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి:** రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ముళ్ళ అన్సర్ బాష ఆధ్వర్యంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను చాగలమర్రి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర టిఎన్టియుసి అధ్యక్షులు గుత్తి నర్సింహులు, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ కన్వీనర్ నాగరాజు యాదవ్, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు కొలిమి హుస్సేన్ వలి, మండల టిడిపి నాయకులు అలంసా గారి మౌలాలి, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి హనీఫ్, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు:** మండలంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి తెలుగు యువత రాష్ట్ర నాయకులు మహేష్ నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, నాయకులు గోవిందు, శివ శంకర్ స్వామి, మండల తెలుగు యువత అధ్యక్షులు మధు కృష్ణ, నాయకులు సత్యనారాయణ రెడ్డి, హాఫీజ్, కృష్ణయ్య హనుమంతు నాయక్ కరిముల్ల, లింగ స్వామీ షేక్ కరిం బాషా, అది రెడ్డి, చంద్ర, మాబాష పాల్గొన్నారు. **గడివేముల:** చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఎస్సీ సెల్ అధ్యక్షులు దామోదరం నాగ శేషులుఆధ్వర్యంలో కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మండలాధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సీతారాం రెడ్డి, టిడిపి నాయకులు బూజునూరు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేశం రమణారెడ్డి, దేశం పుల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **బనగానపల్లె:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 73వ పుట్టిన వేడుకలను గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు సీనియర్ నాయకులు బిసి రామనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, మిట్టపల్లి సర్పంచ్ తులసి రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు అన్వర్ సాహెబ్, టిప్ టాప్ కలాం, అల్తాఫ్ హుస్సేన్, బొబ్బల రామ మద్దిలేటి రెడ్డి, వేములపాడు గురప్ప మంగపేట యు.జి. శ్రీనివాసులు, హమ్మద్ హుస్సేన్, షేక్షావలి, రఫీ, గౌండ బాబు, కార్యకర్తలు, బిసిజెఆర్ అభిమానులు పాల్గొన్నారు. **అవుకు :** మండలంలోని రామాపురం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు ఐ.ఉగ్ర సేనారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను భూమా అఖిలప్రియ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తాలూకా నాయకులు భార్గవ్ రామ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, కౌన్సిలర్ హుస్సేన్ భాష, నాయకులు సిద్ధి సత్యం, కాంట్రాక్టర్ నన్నే బాయ్ గారి జిలాని, నాగంజి పాల్గొన్నారు.

నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

పాములపాడులో..

కొత్తపల్లిలో..